ను బ్రతికించు తమ్ముడూ! అని అతని చేతులు పట్టుకుని కన్నీళ్ళు కార్చాడు. రామారావు యిక ఆగలేకపోయాడు. "పాపా! పాపా!" అని పిలుస్తూ వచ్చి మంచంమీద కూర్చుని తలనిమిరాడు. పాప కళ్లు తెరిచింది. "చిన్నాన్నా! వచ్చావా చిన్నాన్నా?" అన్నది. తెలివి తప్పిపోయింది. రామారా వెన్నో మందులు పోశాడు.

"మర్చిపోకు చిన్నాన్నా! మన నెవ్వరూ వేరు చెయ్యలేరు చిన్నాన్నా! చిన్నాన్నా!" అంటూ అతని ఒడిలో వాలిపోయింది. పాప జీవితం ముగిసింది. "పాపా" అని ఏడ్చాడు రామారావు.

చంద్రశేఖరంగారి కిప్పుడన్నీ అర్థమయ్యాయి. తన చేతులారా చేశానని అతనికి బాధకలిగింది. కాని సమయం మించిపోయింది.

"మీ పగ తీరిందనుకుంటాను నాన్నా! నేనేదో దుష్కార్యం చేస్తున్నానని పాపనించీ, మీనించి వేరుచేశారు. 'చిన్నాన్నా!' అని నోటితో పిలవడానికికూడా వీల్లేదన్నారు. మన ద్వేషాలకు పాపబలైంది. అన్నయ్యను అన్నివిధాలా అన్యాయం చేశాం. ఒక్కకూతురు! ప్రాణంతో సమానంగా పెంచుకున్నారు. ఇదంతా మీరు ఆలోచించే చేశారా? కాని మీరెన్ని చేసినా, పాప శారీరకంగా దూరమైపోయినా నా హృదయంలో నిలిచే ఉంటుంది" అన్నాడు రామారావు ఉద్రేకంగా. బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. బీచ్‌లో కూర్చున్నాడు. అతని మనస్సంతా వేదనాపూరితమైపోయింది.

* * *

రామారావలా కూర్చుండి పోయాడు. కళ్ళలోంచి నీళ్ళు కారిపోతున్నాయి. ఇంతలో మళ్ళా "చిన్నాన్నా!" అన్న పిలుపు వినబడింది. అప్రయత్నంగా వెనక్కు తిరిగాడు. అయిదేళ్ళపాప యిసుకలో ఆడుతూ చిన్నాన్నని పిలుస్తోంది. ఆ పాపలో సుగుణ మెరిసింది. గబగబా వెళ్ళి యెత్తుకుని 'చిన్నాన్నా అనమ్మా!' అన్నాడు. పాప తెల్లబోయి దిగబోయింది. పాపతో ఆడే యువకుడతన్ని చూచి యేదో బాధపడుతున్నాడని గ్రహించాడు. 'చిన్నాన్నా అని పిలు పాపా!' అన్నాడు. పాప ఆశ్చర్యంగా రామారావువేపు చూసి 'చిన్నాన్నా!' అన్నది. 'ఒక్కసారి, ఒక్కసారే' అని మళ్ళా అనిపించి పాపను ముద్దుపెట్టుకుని దింపాడు. ఆ పాప వెళ్ళిపోయింది...

---

స్కెచ్

# కోర్టు పక్షి

"పారిజాత"

కోర్టు వ్యవహారాలంటే-శంకరానికి మంచి సరదా. ప్రతిరోజూ ఏదోపని కల్పించుకొని కోర్టు చుట్టూ తిరిగి రావడం అతని దినచర్య. ఈ విషయంలో తండ్రీ కొడుకులకు తీవ్రంగా అభిప్రాయ భేదాలు కల్గుతూండేవి. శంకరానికి-ఒక కూతురు-ఒక కొడుకు-కూతురుకు యింకా పెళ్ళిచేయలేదు. సుబ్బారావుకు మాత్రం ఎల్లాగో చెయ్యగలిగాడు.

లక్ష్మి వివాహ విషయంలోనూ పంట వసూళ్ల విషయంలోనూ, గ్రామంలో తగవుల విషయంలోనూ తండ్రీకొడుకులు తగాదా పడేవారు.

శంకరం చెప్పుకోతగ్గ వ్యవహర్త. అంటే, వ్యవహారం సులభంగా పరిష్కారం కాకపోయినా తాడోపేడో తేలేవరక్కు కోర్టులు విడచిపెట్టడు, దానికోసం ఎంత ఖర్చుజరిగినా లక్ష్యపెట్టడు. గ్రామంలోని వ్యవహారము లన్నిటికీ తనని అడక్కపోయినా—తోచినవిధంగా సలహాయిచ్చి వీలైతే కోర్టువరకూ సాగనంపే అలవాటు శంకరానికి.

పిల్లవివాహంలో ఏమాత్రం శ్రద్ధవహించినా సులువుగా జరిగిపోయేది. దానికోసం సవాలక్షకోరికలు పెట్టుకొని పిల్లవయస్సు ముదిరి వ్యవహారం సాంతం చెడేదాకా తెచ్చి పెట్టుకొన్నాడు.

తండ్రీ కొడుకులు మాత్రం ఏమంత పొత్తుతో వుంటున్నారు! ఆస్తి వగైరాలు పంచుకోక పోయినా, వచ్చే ఫలసాయాలు మాత్రం పంచుకొంటున్నారు. ఈ పంపకాలలో వాటాలు తెగక యిరువురూ మునసబుగారిదాకా తీర్పుకు వెళ్ళడం అందరికీ తెలుసున్నదే. ఈ విషయంలో మాత్రం కోర్టులు చూడలేదు. అదే శంకరంలో ప్రత్యేకత.

సుబ్బారావు నెమ్మదైన మనిషి. గుట్టుగా వ్యవహారం తేల్చే స్వభావం. ఏదో విధంగా తండ్రితో రాజీ పడదామని చూచినా, శంకరం సాఫీగా సాగనిచ్చేవాడు కాదు. సుబ్బారావు వాటాకువచ్చినభూమి స్వంతసేద్యం మొదలెట్టాడు. ప్రతిరోజూ పొలం రాకపోకలలో గూడెంలోని కన్నెపడుచు-అంటే సుబ్బారావుకు సాయంచేస్తూ వున్న రామయ్య కూతురు-పై మక్కువగలిగింది. ఇది రహస్యంగానే చెలామణీ అవుతున్నా—ఎంత కాలం వుంటుంది యిలాగ? రామయ్య యింట్లో లేనిసమయంచూచి సుబ్బారావు యింట్లో ప్రవేశించాడు. ఈ వ్యవహారం కొంతకాలానికి గూడెంలో పొక్కింది. సొమ్ము వగైరాలలో సుబ్బారావుతో తూగకపోయినా, మానాభిమానాలలో సుబ్బారావుకు మించినవారు గనుక—రామయ్యను పిలిచి వ్యవహారం ముదరపెట్టవద్దని చెప్పారు ఆ గూడెం పెద్దలు.

ఇది తెల్సుకొన్న సుబ్బారావు రామయ్యకు డబ్బు "ఎర" చూపించాడు. రామయ్యకు యింట్లో కూతురుతప్ప యింకెవరూ లేరు. మొగ్గు సుబ్బారావువైపే చూపడంతో—గూడెంలో పార్టీలు మొలకలెత్తినయ్. సుబ్బారావు రాకపోకలు జాస్తీ అయినయ్.

ఇది కనిపెట్టిన గూడెం పెద్దలు రామయ్య యింట్లోలేకండాచూసి సుబ్బారావును పట్టుకొని చెట్టుకు కట్టేశారు. ఈ విషయంలో రామయ్య మినహా గూడెం అంతా ఒకటేపక్షం- సుబ్బారావును అయిదొందల రూపాయలు జరిమానాగా యిచ్చుకోమ్మని తీర్పునిచ్చారు.

సుబ్బారావుకు ఎటూ పాలుపోలేదు. కంట తడిపెట్టడం చూచి గూడెం పెద్ద సీనయ్య తన భార్యమెడలో పట్టెడ సొమ్ముకు బదులుగా జమ కట్టాడు. సుబ్బారావు తత్ఫలితంగా విడుదలైనాడు.

జరిగినదంతా గ్రామంలో చాటవద్దని పెద్దల్ని బ్రతిమిలాడాడు సుబ్బారావు.

వారంరోజులు గడవకముందే గూడెం పెద్దలకి నోటీసులు జారీచేయబడినై — గ్రామం అంతా జరిగిన గాథని ఒక కథగా చెప్పుకోవడంతో సుబ్బారావుకి తలెత్తుకోలేనంత అవమానం!

తండ్రితో ఎన్నిచెప్పినా వినలేదు -గూడెం అంతా ఒక్క త్రాడుమీద వుంటారని చెప్పినా శంకరం ఒప్పుకోలేదు. నలుగురిలోనూ అవమానం. అప్రతిష్ట పాలవుతామని విన్నవించినా ఆగలేదు. కొడుకును మెల్లగా ఒప్పించి కోర్టుకు పయనం కట్టాడు. కోర్టు విషయాల్లో ఉత్తర దక్షిణ ధృవాలనుకొనే తండ్రీ కొడుకులు ఏకమవడం అందరికీ ఆశ్చర్యంగానే వుంది.

అయిదారు వాయిదాలు పడినై. అంతా కోర్టుకు పోతూనేవున్నారు. తీర్పు ఎవరిపట్ల వుంటుందో అని అంతా ఎదురుచూస్తూవున్నారు. శంకరంపట్ల అనుకూలంగా వుంటే—ఈ దెబ్బతో గూడెం అంతరించిపోవాల్సిందే అని కొందరు—గూడెంవైపు మొగ్గితే— ఈ దెబ్బతో స్వంత వ్యవసాయం కట్టిపెట్టి అమరకానికిచ్చుకోవాల్సిందే అని ఎవరికి తోచినవిధంగా చెప్పుకొంటున్నారు.

ఆరోజు తీర్పుచెప్పేసమయానికి కోర్టులో జనం బాగానే చేరారు. తీర్పువింటానికి తండ్రీకొడుకులు ఒకేబండిలోవచ్చారు.

తీర్పు గూడెంప్రజలకి అనుకూలంగా జరిగింది. దానికి సాయంగా వారి ఖర్చులుకూడా యిచ్చుకోమన్నారు. సారంలేదు కాబట్టి అప్పీలుకు వీలు లేదన్నారు.

గూడెంవాళ్ళు శంకరం ముఖం చూడటానికి అంతా వేచివున్నారు. కాని ఎంతసేపటికీ వారి కోర్కె తీరలేదు—